డంపింగ్‌యార్డును ఉపసంహరించుకోవాలి

రిలే నిరాహారదీక్షకు సంఘీభావం తెలుపుతున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి 23 : ప్యారానగర్ డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ) అనుమతులు రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌక్ వద్ద మహిళా, రైతు జేఏసీల ఆధ్వర్యం లో రిలే నిరాహారదీక్షలు 47వ రోజుకు చేరుకున్నాయి. దీనికి రైతు జేఏసీ నాయకులు చిమ్ములగోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, ఉదయ్ కుమార్, దేవేందర్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, నాయకులు పడమటి లక్ష్మారెడ్డి, మందబలరాంరెడ్డి నాయకులు రిలే నిరాహారదీక్షలు చేపట్టిన ఆందోళనకారులకు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, మంభాపూర్ గ్రామాల్లో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు జేఏసీ నాయకులు కుమ్మరి ఆంజనేయులు, రామకృష్ణ, కొరివి సురేశ్, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న కమిషనర్

జిన్నారం మార్చి 23 : ఎల్ఆర్ఎస్ 25 శాతం ఫీజు రాయితీతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎల్ఆర్ఎస్ పథకంలో భాగంగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించిన లబ్ధిదారులకు కమిషనర్ ప్రొసీడింగ్ క్రమబద్ధీకరణ పత్రాలను అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించిన వారికి ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తామన్నారు. మార్చి 31లోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నవారికి ఎల్ఆర్ఎస్ ఫీజులో రాయితీ వర్తిస్తుందని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దరఖాస్తుదారులను కోరారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ముని నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి

అమీన్‌పూర్‌లో..

అమీన్‌పూర్, మార్చి 23 : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ఇప్పటివరకు 88 మంది ఎల్ఆర్ఎస్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందించినట్లు కమిషనర్ జ్యోతి రెడ్డి తెలిపారు. సుమారు రూ. ఐదు కోట్లు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఆదివారం ఒక రోజే 56 మందికి ప్రొసీడింగ్ అందజేసినట్లు తెలిపారు. తమ పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి 8 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

కొండాపూర్,మార్చి 23 : గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ మండల కమిటీ అధ్వర్యం లో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాబురావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టావా అని అన్నారు. కొండాపూర్ మండలంలోని పంచాయతీ వర్కర్లలకు నాలుగు నెలలుగా వేతనాల బకాయిలు ఉన్నాయని, వారికి వెంటనే వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 25న హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు, యూనియన్ నాయకు లు సంజీవులు, వెంకయ్య, కిషన్, రాజు, కవిత, పుల్లయ్య, సత్తమ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలందరికీ న్యాయం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభు గౌడ్, తదితరులు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 23 : ఈనెల 25న 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీలో బిల్లు ఆమోదం తెలపనున్న నేపథ్యంలో బీసీలలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ఉండాలని బీసీ సంక్షేమ సంఘం తీర్మానం చేసింది. ఈ మేరకు ఆదివారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీలలో ఇతర వర్గాలను కలుపవద్దన్నారు. బీసీలలోని పేదలకు, నిరుద్యోగ యువతకు రాజీవ్‌గాంధీ యువ వికాస్ పథకం కింద ఆదుకోవాలన్నారు. ఇండ్లు లేని నిరుపేదలైన ప్రతి కుటుంబానికి ఇండ్లు నిర్మించాలనే పలు తీర్మానాలు చేశారు. రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని బీసీలకు వారు పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకుడు ప్రభుగౌడ్, కిష్టయ్య, గోకుల్‌కృష్ణ, మల్లికార్జున్ పాటిల్, వెంకటేశ్ యాదవ్, నారాయణ, జావేద్, రాజేశ్వర్ స్వామి, కరన్‌జిత్‌సింగ్, కుమ్మరి రాములు, కొండయ్య, సుధాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

ఖర్జూరాన్ని తినిపిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 23 : జహీరాబాద్ పట్టణంలో క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సంజీర్‌రెడ్డి, వెంకటేశం, నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు, షేక్ ఫరీద్, విజయ్‌కుమార్, యాకుబ్, బండిమోహన్, అబ్దుల్లా, మోహీజోద్దీన్, మీధున్‌రాజ్ పాల్గొన్నారు.

దుబాయ్ ఇఫ్తార్ విందులో ..

దుబాయ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, మార్చి 23 : రంజాన్ సందర్భంగా దుబాయ్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోదర భావంతో కూడిన ఆత్మీయతకు ఇఫ్తార్ విందు ప్రతీక అని తెలిపారు.

ఘనంగా బోనాలు

రాయికోడ్, మార్చి23 : మండల పరిధిలోని సింగితంలో ఆదివారం ఘనంగా బీర ప్పస్వామికి బోనాలు తీశారు. బీరప్పస్వామి జాతర సందర్భంగా గొల్ల కురుమలు ఘనంగా గ్రామ ప్రధాన వీధుల గుండా తిరుగుతూ బోనాలను గ్రామ శివారులో ఉన్న బీరప్ప స్వామి ఆలయానికి తరలించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో ఆకట్టుకున్నాయి. మాజీ సర్పంచ్ అంబన్న, నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు రాజు కురుమ, నాయకులు కిష్టయ్య, అంజయ్య, శ్రీనివాస్, అంజయ్య, బాబు ఉన్నారు.

పచ్చని సిగలో చెత్తాచెదారం

- భెల్ చెత్త డంపింగ్‌తో వాయుకాలుష్యం
- అపరిశుభ్ర వాతావరణం.. పర్యావరణానికి తూట్లు
- భెల్ అధికారుల తీరుపై మండిపడుతున్న ప్రకృతి ప్రేమికులు, స్థానికులు

రామచంద్రాపురం, మార్చి 23 : బీహెచ్ఈఎల్ అంటేనే పచ్చదనం, స్వచ్ఛమైన గాలి, చక్కటి వాతావరణం. ఇలాంటి ప్రశాంతమైన వాతావరణం హైదరాబాద్‌కి దగ్గర్లో మనకు ఎక్కడ దొరకదని చెప్పుకోవచ్చు. ట్రాఫిక్‌లో ఉక్కిరిబిక్కిరయ్యే వాహనదారులకు భెల్ పరిసరాల్లోకి రాగానే ఏదో తెలియని ప్రశాంతత. భెల్ మీదుగా ఆర్సీపురం, పటాన్‌చెరుకు వెళ్లే వారు చందానగర్, లింగంపల్లి వరకు మెయిన్‌రోడ్డుపై వచ్చి అక్కడి నుంచి బీహెచ్ఈఎల్‌లోకి ప్రవేశించి పచ్చటి అందాన్ని, స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తూ ఈ మార్గంలో ప్రయాణించి తెలియని అనుభూతిని పొందుతారు. కానీ ఇదంతా మొన్నటి వరకు భెల్‌లో ఉన్న పరిస్థితి. ఇప్పుడు భెల్‌లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తుంది. పార్కుల మెయింటనెన్స్ లేదు, పారిశుధ్య సమస్యలు ఇలా చెప్పుకుంటూ పోతే గతంలో భెల్‌లో ఉన్న వాతావరణం ఇప్పుడు లేదని చెప్పుకోవచ్చు. భెల్ సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమా? నిర్లక్ష్యమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భెల్ పరిసరాల్లో గతంలో మాదిరిగా ఇప్పుడు మెయింటనెన్స్ ఏమాత్రం ఉండటంలేదని ప్రకృతి ప్రేమికులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వెంటనే భెల్ ఈడీ స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పర్యావరణానికి తూట్లు..

బీహెచ్ఈఎల్ అంటేనే పర్యావరణ పరిరక్షణకు పెట్టింది పేరు. భెల్ చుట్టూరా కొన్ని వేల సంఖ్యలో చెట్లు, గ్రీనరీ ప్రాంతాలు ఉన్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పర్యావరణానికి విఘాతం కలుగుతుంది. భెల్‌లో చెత్త డంపింగ్ ద్వారా వాయు కాలుష్యం పెరుగుతుంది.

భెల్‌లోని చెత్త డంపింగ్ యార్డ్‌లో మంటలతో వెదజల్లుతున్న పొగ

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు

భెల్‌లో అపరిశుభ్రంగా మారిన రోడ్డు మార్గం

భెల్ కీర్తిమహాల్ నుంచి ఆర్సీపురం వెళ్లేందుకు ఉన్న ప్రధాన రోడ్డు మార్గంలో చెత్త డంపింగ్ చేస్తుండడంతో వాహనదారులు, వాకర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో చెత్త డంపింగ్‌లో మంటలు చెలరేగడంతో వెదజల్లే పొగతో వాయు కాలుష్యం ఏర్పడి పర్యావరణానికి నష్టం వాటిళ్లుతుంది. చెత్త డంపింగ్ ఏరియాతో పాటు భెల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లను మూగజీవాలు తింటూ అనారోగ్యానికి గురవుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, చెత్త రోడ్డు మీదకు వచ్చి చేరడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే భెల్‌లో చెత్తడంపింగ్ ఆపై ఎక్కడ పడితే అక్కడ అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భెల్‌లో పూర్వ పరిస్థితులను తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జహీరాబాద్‌లో భగత్‌సింగ్ పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్: తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్: భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఫోరం ఫర్ బెట్టర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర

గుమ్మడిదలలో సర్దార్ భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మందభాస్కర్‌రెడ్డి, నేతలు

భగత్‌సింగ్‌కు నివాళి

సర్దార్ భగత్‌సింగ్ జయంతిని ఆదివారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. నేతలు, ప్రజాప్రతినిధులు ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ స్వాతంత్రం కోసం చేసిన కృషిని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నేటి యువత పయనించాలని పిలుపు నిచ్చారు.

–సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, మార్చి 23

భర్తను చంపేందుకు భార్య కుట్ర

మునిపల్లి,మార్చి 23 : ప్రియుడితో కలిసి భర్తను చంపేందుకు భార్య ప్రయత్నం చేసిన సంఘటన మండలంలోని పెద్ద గోపులారం గ్రామ శివారులో చేసుకుంది. ఆదివారం మండలంలోని బుదేరా పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కొండాపూర్ సీఐ వెంకటేశం మాట్లాడుతూ మండలంలోని పెద్దగోపులారం గ్రామానికి చెందిన రవి పంచాయతీ కార్యదర్శి శనివారం జహీరాబాద్ వైపు నుంచి సొంత ఊరైన పెద్దగోపులారం గ్రామానికి బైక్‌పై వస్తుండగా జహీరాబాద్ నుంచి రవి భార్య హరిత ప్రియుడు తన స్నేహితులతో కలిసి థార్ వాహనంతో ఢీకొట్టారు. ఈప్రమా దం నుంచి రవి ప్రాణాలతో బయటపడినట్లు సీఐ తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో అసలు సంగతి భయట పడింది. వివాహేతర సంబంధానికి భర్త రవి అడ్డుగా ఉన్నాడని భార్య హరితనే ప్రియుడితో కలిసి భర్తను చంపేందుకు కుట్ర చేసిందని పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. భర్తను ప్రియుడితో కలిసి చంపేందుకు ప్రయత్నం చేసిన భార్య హరిత, ప్రియుడితో పాటు మరో వ్యక్తి మిరుదొడ్డి సాయి, దాసోజీ సాయికిరణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్, బుదేరా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాండు, తుకారం, హనీఫ్, సునీల్‌లను కొండాపూర్ సీఐ అభినందించారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

దాడి జరిగిన విషయం పై వివరాలు తెలుసు కుంటున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

అందోల్/పుల్కల్, మార్చి 23 : జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య కుటుంబంపై కత్తులతో దాడి చేసిన నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. పుల్కల్ మండల పరిధిలోని గొంగ్లూరులో పల్లె సంజీవయ్య, అతడి కుమారుడు క్రాంతిపైన జరిగిన దాడి విషయంలో ఆదివారం పల్లె సంజీవయ్యను కలిసి పరామర్శించారు. అణగారిన వర్గానికి చెందిన పల్లె సంజీవయ్య కుటుంబంపై దాడి చేయడం అమానుషమని ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్ర అన్నారు. కత్తులతో దాడి చేసిన మురళీకృష్ణ అనుచరులపై హత్యాయత్నం కేసుతో పాటు, పీడీయాక్ట్ నమోదు చేయాలని సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరయ్య, దళిత సంఘం నాయకులు ఎర్రోళ్ల పోచయ్య, కృష్ణ, శ్రీహరి, కృష్ణంరాజు, నేతలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

ఇఫ్తార్ విందుపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్ రెడ్డి

రామచంద్రపురం, మార్చి 23 : రామచంద్రపురం పట్టణంలోని ఈద్గాలో ఈనెల 27న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం రామచంద్రపురంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భారతీ నగర్, ఆర్సీపురం డివిజన్ పరిధిలోని ముస్లిం మత పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు కుమార్ గౌడ్, పరమేశ్ యాదవ్, అజీమ్, గౌస్, మునీర్, రఫిక్, కుతుబుద్దీన్, యూసఫ్, అన్వర్, చాంద్, రియాజ్, అహ్మద్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

జిన్నారం, మార్చి 23 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ పూరి జగన్నాథ్ ఆలయం వద్ద శ్రీ జగన్నాథ్ ఉత్కల్ సంస్కృతి సంఘం, ఒడిశా డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అన్ని రకాలైన వైద్య పరీక్షలు ఒకే చోట అందిస్తూ, ఉచితంగా మందులు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. నిర్వాహకులు మాజీకౌన్సిలర్ చంద్రారెడ్డిని, స్థానిక నాయకులను ఘనంగా సన్మానించారు. మాజీ కౌన్సిలర్లు చంద్రయ్య, గోపాలమ్మ పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో ఎంతో మేలు

జహీరాబాద్ : హద్నూర్ గ్రామ సమీపంలో పొలాన్ని ట్రాక్టర్‌తో దుక్కి చేసేందుకు దున్నుతున్న రైతు

జహీరాబాద్/తొగుట,మార్చి 23 : రైతు చేయాలనుకుంటే ఏకాలంలోనైనా పనులకు కొదవ ఉండదు. వానాకాలం, శీతాకాలం, ఎండా కాలం ఇలా అన్ని కాలాల్లో రైతులు బిజీగా గడుపుతుంటారు. వేసవిలో ఎండలకు భయపడి వ్యవసాయ పనులకు కొంత విరామం ఇస్తారు. కానీ, ఆకాలంలోనే రైతులు చేసుకోవడానికి పనులు చాలానే ఉంటాయి. వచ్చే వర్షాకాలం నాటికీ పంటలు వేయడానికి ఇప్పటి నుంచే దుక్కులు రెడీ చేసుకుని పనుల్లో నిమగ్నమైపోతున్నారు. ఎండకాలంలో పొలంలో చేసే పనుల బట్టే పంట దిగుబడి ఉంటుంది. అందుకే వేసవిలో దుక్కులు దున్నడం వల్ల చాలా ప్రయోజనాలుంటాయని వ్యవసాయ శాస్త్రవేతలు, అధికారులు సూచిస్తున్నారు. దీం తో సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ నియోజకవర్గం, సిద్దిపేట జిల్లా, తొగుటలోని ఆయా మండలంలోని గ్రామాల్లో చాలా మంది రైతులు ట్రాక్టర్లు, మరికొంత మంది ఎడ్లతో తమ పొలాలను దుక్కులు చేసే పనిలో నిమగ్నమైయ్యారు. భూమి ఎండకు బాగా కాగుతుంది. దీంతో భూమిలోపలి క్రిములు నశించిపోతాయి. పంటలు వేసిన ప్పుడు క్రిమి కీటకాలు బెడద ఉండదు. మండుల పిచికారీ చేయాల్సి ఉంటుంది. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలిస్తే కలుపు మొక్కలు బాగా పెరుగుతాయి. అవి భూమిలో నీటిని, పోషక పదార్థాలు గ్రహిస్తూ ఉంటాయి. దీంతో భూమిలోని లోపలి పొరలు నుంచి నీరు ఆవిరై పోతుంది. తద్వారా భూసారం తగ్గుతుంది. దీంతో ఆ తర్వాత పంటలకు అవసరమైన పోషకాలు లభించవు. అశించిన దిగుబడి రాదు. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్, మేలో కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకొని భూమిని 25–30 సెంటీమీటర్ల లోతులో దుక్కిని చేసుకుంటే మంచి ఫలితాలను పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అంటున్నారు.

వర్షం కురియండతో దుక్కులు చేస్తున్న రైతులు

వేసవిలోనే దుక్కులు దున్నుకోవాలి

వానకాలం, యాసంగి సీజన్‌లో పంటలు సాగు చేసి పంటల కోత చేసిన తర్వాత తప్పని సరిగా పొలాన్ని దున్నడం చేయాలి. వేసవిలో పొలాన్ని దున్నడం వల్ల పంటల దిగుబడికి ఎంతో ఉపయోగపడుతుంది. పంటలకు నాశనం చేసే పురుగులు నాశనం అవుతాయి. దుక్కులు చేసే ముందు పశువుల పెంటపోగు, సేంద్రియ ఎరువులను వేస్తే పొలానికి మరింత బలం వస్తుంది.

-డాక్టర్ విజయ్ కుమార్, ప్రొ. జయశంకర్ సార్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత, బసంతపూర్ (జహీరాబాద్)

ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందడంపై హర్షం

మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుమ్మడిదల, మార్చి 23 : ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదం పొందడంతో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సుదర్శన్, మాజీ మండల అధ్యక్షుడు సాయిలు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

విరాళం అందజేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, మార్చి 23 : పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి రూ. 50వేల విరాళం అందజేశారు. ఆదివారం పటాన్‌చెరులో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ నివాసంలో తెల్లాపూర్ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నిర్మాణ కమిటీ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ చారి సమక్షంలో శ్రీశైలం చారితో కలిసి కార్పొరేటర్ విరాళాన్ని అందజేశారు. అనంతరం మాదారంలో జరుగుతున్న మల్లన్న స్వామివారి ఆలయ జాతర మహోత్సవ ఆహ్వానపత్రికను కార్పొరేటర్‌కు గ్రామస్తులు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్‌చారి, ప్రకాశ్ చారి, భీమ్ లింగాచారి, శ్రీరాములు చారి, జనార్దన్ చారి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మరోసారి మోసం

రాయికోడ్, మార్చి 23 : రాష్ట్ర రైతులకు మరోసారి మోసం చేయాడానికి రైతులకు రుణమాఫీ పూర్తయినట్లు అసెంబ్లీలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టంచేయడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ నాయకుడు వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఏడాదిన్నర అవుతున్నా రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా రకరకాలుగా అభ్యంతారాలను చెప్పడం సరైనది కదా న్నారు. ఇప్పటి వరకు చాలా మంది రైతులకు రైతు భరోసా అందలేదన్నారు.

జీవో విడుదలపై హర్షం

జిన్నారం, మార్చి 23 : ప్రభుత్వం జీవో నెంబర్ 41 విడుదల చేయడంపై పూర్వ రెవెన్యూ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం బొల్లారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జిల్లా మాజీ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు సంబురాలు చేసుకుంటూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణలో భాగంగా ప్రభుత్వం జీవో విడుదల చేయడం సంతోషదాయకమన్నారు. ఉద్యోగులు దుర్గాప్రసాద్, విజయ్ కుమార్, పాండు, మల్లేశం, సుమిత్ర, సమీర్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జిన్నారం, మార్చి 23: రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం గడ్డపోతారం గ్రామ శివారులో ఓ గుర్తు తెలియని వ్యక్తి వయస్సు 40–45 ఉంటుందని వాహనం ఢీకొట్టడంతో తల, ముక్కుపై తీవ్ర గాయాలు కాగా, అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్ర భుత్వ దవాఖానకు తరలించామని తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

హాసిల్‌బాండ్ మోసిన్(ఫైల్)

రాథోడ్ నిరోష(ఫైల్)

జహీరాబాద్, మార్చి 23 : ఇద్దరు అదృశ్యమైన ఘటన జహీరాబాద్ పట్టణంలో వేర్వేరు ఘనటలో చోటుచేసుకున్నాయి. జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్ ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన ఆగు రాథోడ్ నిరోష (24) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అదే కాలనీకి చెందిన హాసిల్బాండ్ మోసిన్ ఆటో డ్రైవర్ (24) ఈ నెల 17న ఆటో కిరాయికి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఇరువురి కుటుంబ సభ్యులు ఆదివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాశీనాథ్ పేర్కొన్నారు.